క్లుప్తంగా

దమ్ముంటే ఒంటరిగా పోటీ చెయ్

పవన్ కల్యాణ్‌కు వీసం సవాల్

నక్కపల్లి: దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చెయ్.. అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ సవాల్ చేశారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా పవన్‌కల్యాణ్ చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ముఖ్యమంత్రిని తిడితే సహించేది లేదన్నారు. చంద్రబాబుతో పొత్తు లేకుండా ఒక్కసీటు కూడా పోటీ చేయలేని పవన్‌కల్యాణ్ జగన్ పాలన గురించి విమర్శలు చేస్తే వైఎస్సార్ సీపీ అభిమానులు తగిన బుద్ధి చెబుతారన్నారు. కాపులను చంద్రబాబు 40 ఏళ్ల నుంచి ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారని, అలాంటి వ్యక్తికి కాపులను తాకట్టు పెట్టి ప్యాకేజీ తీసుకున్న పవన్‌ను కాపులు నమ్మొద్దని కోరారు. వైఎస్ కుటుంబానికి, గుడివాడ అమర్ కుటుంబానికి రాజకీయ చరిత్ర ఉందన్నారు.

జిల్లాస్థాయి గాలిపటాల పోటీలు నేడు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో సంక్రాంతి పర్వదినంలో భాగంగా పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం మునగపాక బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో స్వర్గీయ ఆడారి అప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు ఆడారి వెంకట సత్యనారాయణ ప్రోత్సాహం, గౌరీ యూత్ సహకారంతో జిల్లాస్థాయి గాలిపటాల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీకాంత్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పోటీల్లో గెలుపొందే వారికి ప్రథమ బహుమతిగా రూ.3500, ద్వితీయ బహుమతిగా రూ.1500 అందజేస్తామన్నారు. 15వ తేదీన సంక్రాంతి సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు, గుర్రప్పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి అప్పలనాయుడు తెలిపారు. తెలుగురైతు, గౌరీ యూత్ సంయుక్త నిర్వహణలో జరిగే పోటీలను విజయవంతం చేయాలని అప్పలనాయుడు తదితరులు కోరారు.

కొనసాగుతున్న నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల ధర్నా కొనసాగుతోంది. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా శుక్రవారం నాటికి 75వ రోజుకు చేరింది.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లతో ఎస్.రాయవరం పోలీసులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు శివారు మామిడి తోటలో పేకాట ఆడుతుండగా నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.28,200 స్వాధీన పరచుకుని నాలుగు బైక్‌లు సీజ్ చేసినట్టు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన వారిలో కొరుప్రోలు, తిమ్మాపురం గ్రామాలకు చెందిన వారు ఉన్నారన్నారు.

వాహన పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

రాంబిల్లి: వాహన పన్ను పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆటో, లారీ యూనియన్ సభ్యులు రాంబిల్లిలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు బి.భాస్కరరావు, సీహెచ్ శివాజీ తదితరులు మాట్లాడుతూ పన్ను పెంపు ప్రజలకు ఆర్థికంగా భారం కావడమే కాకుండా, పలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో, ట్రాక్టర్, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సన్యాసిరావు

మునగపాక: తన మనుమడు కార్తీక్ జన్మదినం సందర్భంగా మునగపాక పంచాయతీ పారిశుధ్య కార్మికులకు విశ్రాంత మలేరియా అధికారి ఆడారి సన్యాసిరావు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఏడులాగే ఈ ఏడాది కూడా సంక్రాంతి పర్వదినం సందర్భంగా దుస్తులు అందజేసినట్లు సన్యాసిరావు తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ సందర్భంగా సన్యాసిరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మొదలైన పండగ సందడి

- వాడవాడలా భోగి ఏర్పాట్లు
- అత్తారిళ్లకు కొత్త అల్లుళ్లు

నక్కపల్లి: సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. భోగి వచ్చిందంటే కుర్రాళ్లు, చిన్నపిల్లలకు సందడే సందడి. మూడు రోజుల ముందు నుంచే ఎక్కడెక్కడి నుంచో చెట్లు నరికి తీసుకు వచ్చి భోగి మంటలకు సిద్ధం చేస్తారు. పెద్దలు కూడా ఇంట్లో ఉన్న పాత సామగ్రిని భోగి మంటల్లో వేస్తారు. సూర్యోదయానికి ముందే భోగి మంట వేయడమనేది అనాదిగా వస్తున్న ఆచారం. దీనివల్ల గ్రామానికి పట్టిన దోషం పోతుందనేది కొందరి నమ్మకమైతే, రావణుని చితిగా భావించడం మరికొందరి అభిప్రాయం. అందుకే అందులో పేడతో చేసిన పిడకలు వేయడం రావణునిపై నిరసన తెలియజేయడంగా చెబుతారు.

గోదా రంగనాథుల పరిణయం..

ఈ భోగి పండక్కి మరో ప్రత్యేకత ఉంది. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం గోదాదేవి నెలరోజుల పాటు ధనుర్మాస వ్రతం ఆచరించి శ్రీరంగనాథుని వివాహమాడిన పుణ్యదినం. ఈ విధంగా ఆయన్ను పొంది భోగం అనుభవించింది కాబట్టి ఈ పర్వదినాన్ని భోగి అంటారని పెద్దలు చెబుతారు. రైతులకు ధాన్యం రూపంలో సంపదలు ఇళ్లకు వస్తాయి. కాబట్టి సంవత్సరమంతా బంధుమిత్రులతో ఈరోజు భోగాలు అనుభవిస్తారు. కనుక ఈరోజున భోగి అని కూడా పేర్కొంటారు. గ్రామాల్లో వేసే భోగి మంటల్లో ప్రతి ఇంట నుంచి ఒక్క పిడకైనా వేస్తారు.



భోగి మంట వేస్తున్న దృశ్యం (ఫైల్)

బొమ్మల కొలువుకు ప్రత్యేక స్థానం..

ఆడపిల్లలు ఇళ్లల్లో చేసే బొమ్మల కొలువు చూడముచ్చటగా ఉంటుంది. తాము ఆడుకున్న బొమ్మలతో పాటు మిత్రుల నుంచి సేకరించిన రంగురంగుల బొమ్మలతో ఇంటిలో ప్రత్యేకంగా అలంకరిస్తారు. వారం రోజుల పాటు ఈ బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు.

చిన్నారులకు భోగి పళ్ల సంబరం..

పిల్లల నెత్తిన కుటుంబ సభ్యులందరూ భోగిపళ్లు పోసి వారిని ఆశీర్వదించడం ఈ పండగలో మరో సాంప్రదాయం. సాయంత్రం పేరంటాళ్లను పిలిచి చిన్నారుల తలపై భోగిపళ్లు, చెరకుముక్కలు పోస్తారు. ఇది కూడా దృష్టి దోషం పోవడానికే. విష్ణుమూర్తికి రేగు పళ్లంటే ఇష్టం. రేగుపళ్లు చిన్నారుల నెత్తిన పోయడం వల్ల విష్ణుమూర్తి ఆశీస్సులు ఉంటాయని ప్రతీతి.

సందడిగా వ్యవసాయ క్షేత్రాలు

అచ్యుతాపురం (అనకాపల్లి): భోగి సందడి మొదలైంది. వేసవి సెలవులు కావడంతో బంధువులు వారి సొంతూర్లకు, సొంతిళ్లకు చేరుకున్నారు. వ్యవసాయ కుటుంబీకులు వారి వ్యవసాయ క్షేత్రాల్లో భోగి మంటలు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో మునిగారు. దీంతో పొలాల్లో ముందస్తు భోగి సందడి ఏర్పడింది. అంతే కాకుండా భోగి రోజుతో మేలుకొలుపుల కార్యక్రమాన్ని ముగించి, భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎటు చూసినా సందడే

కోటవురట్ల: మార్కెట్‌కు సంక్రాంతి శోభ వచ్చింది. మెయిన్‌రోడ్డు జనాలతో కిటకిటలాడుతున్నాయి. జోళ్లు, కిరాణా, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ఇక పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. లోగిళ్లు కొత్తఅల్లుళ్లు, బంధుమిత్రుల రాకతో సందడిగా మారాయి. ఇంటి వాకిట్లో రంగవల్లికలు కనువిందు చేస్తున్నాయి. భోగి సంబరానికి యువత సన్నద్ధం అవుతున్నారు. వీధుల్లో భోగి మంటల ఏర్పాటుకు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గడప గడపలో పండగ వాతావరణం



కొరుప్రోలులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుకోవడంతో గడప గడపలోనూ పండగ వాతావరణం కనిపిస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాకతో గృహిణులు ఇంటి ముందు నిల్చుని స్వాగతం పలికారు. తమకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. అయితే గ్రామంలో డ్రైనేజీ, తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. పంచాయితీ అధికారులు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నాణ్యమైన తాగునీరు సరఫరా చేసేందుకు గ్రామానికి జేజేఎల్ ఎంలో రూ. కోటికి పైగా నిధులు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మామిడి చంటి, యేజర్ల సీతారామరాజు, చింతలపాటి మణిరాజు, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, కొత్త రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్‌లో గ్రావెల్ రోడ్డు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: 'జగనన్న కాలనీ లబ్ధిదారుల స్థలాల్లో గ్రావెల్ రోడ్డు' శీర్షికన సాక్షిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. యండపల్లి ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో కొంతమంది లబ్ధిదారులకు గతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ స్థలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ లే అవుట్‌కు దారి కోసం గ్రావెల్‌తో రోడ్డు వేసేశారు. ఇదే అంశంపై వెలువడిన కథనంతో లబ్ధిదారుల సమస్య పరిష్కారమయింది. దీంతో లబ్ధిదారుల స్థలాల్లో ఉన్న గ్రావెల్ రోడ్డును తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యండపల్లిలోని జగనన్న కాలనీ లే అవుట్‌లో గ్రావెల్ రోడ్డును తొలగించిన దృశ్యం

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో గల ఆయా గ్రామాల్లో ఫ్రై డే సందర్భంగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కావ్య తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నీటి నిల్వ వున్న ప్రాంతాలను గుర్తించి దోమల నివారణకు ఎబెట్ ద్రావణం పిచికారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఇళ్ళ వద్ద డబ్బాలు, కుండలు, డ్రమ్ములు, గోలాలు, పాత్రల్లో ఉన్న నిల్వ నీటిని పారబోయించారు. వెంకటనగరం గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆర్‌జే బాలాజీసింగ్, పీవీఎస్ఎస్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటనగరంలో మురికి నీటిలో ఎబెట్ ద్రావణం వేస్తున్న వైద్య సిబ్బంది

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. కోడి పందాల నిర్వహణకు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. కోడి పందాలు నిర్వహిస్తే.. ఆ స్థలం గల యజమానిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, జూదం, గుండాట, గుళ్లాట వంటివి నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంకితభావంతో పనిచేయాలి

మునగపాక: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి కోరారు. శుక్రవారం ఆమె మండలంలోని నాగులాపల్లి సచివాలయాన్ని సందర్శించారు. ఉద్యోగుల హాజరు పుస్తకం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే ఉద్యోగులు యూనిఫాం ధరించాలన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పాటుపడాలన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఉన్నారు.



నాగులాపల్లి సచివాలయంలో ఉద్యోగుల హాజరును తనిఖీ చేస్తున్న మంజులావాణి

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

పాయకరావుపేట : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలో గల మంగవరం, గుంటపల్లి, పీఎల్‌పురం గ్రామాలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అర్హులందరికీ అందే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గల సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు.



పీఎల్‌పురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు

కోటవురట్ల: మండలంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కైలాసపట్నంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సహిత రాజగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట : మండలంలో గల రబీ సాగు రైతులు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండల పరిషత్ ఆవరణలో గల స్త్రీ శక్తి భవన్‌లో మండల స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండల సలహా మండలి చైర్మన్ గంగిరెడ్ల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుల ధాన్యం సేకరణపై సిబ్బంది దృష్టి సారించాలని, రబీ పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. నామవరం, సత్యవరం గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సమీకృత దాణాతో మెరుగైన పాల దిగుబడులు

మునగపాక: సమీకృత దాణా అందించడం ద్వారా పాల దిగుబడులు పెరుగుతాయని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఒంపోలులో శుక్రవారం రైతులకు రాయితీపై సమీకృత దాణాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న దాణాను పశువులకు అందించాలన్నారు. పాల దిగుబడులు పెరగడంతో పాటు పశువులు కూడా ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు.



రైతులకు దాణా అందజేస్తున్న ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

రికార్డుల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం: అంగన్‌వాడీ చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం ఇవ్వాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-1, వెల్‌నెస్ సెంటర్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్న చిన్నారులు పరిశుభ్రంగా ఉండేలా ఆయాలు చూసుకోవాలన్నారు. అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే ప్రభుత్వం సమకూరుస్తున్న ఆహారం మెనూ ప్రకారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాలపర్తి సావిత్రి, సుబ్బలక్ష్మి, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సేవలే గ్రేస్ చిల్డ్రన్ మినిస్ట్రీస్ లక్ష్యం

నక్కపల్లి : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే గ్రేస్ చిల్డ్రన్ మినిస్ట్రీస్ ఉద్దేశ్యమని డైరెక్టర్ జి.ప్రవీణ్ రత్నకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నక్కపల్లి మండలం ఉపమాక గ్రామం వద్ద గల లవ్ హూం క్యాంపస్ హాస్టల్లో భారీ వైద్య శిబారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 1000 మంది పేదలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేసారు.

అలాగే కిడ్నీ, గుండె జబ్బుల బాధితులకు ప్రత్యేకంగా వైద్యంతో పాటు వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జీసీఎం చేసే సేవా కార్యక్రమంలో నెలకు రెండు సార్లు సుమారు 500 మంది వితంతువులు, వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నామని, అదే విధంగా తల్లిదండ్రులు లేని పిల్లలకు ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు లవ్ హూం హాస్టల్ ద్వారా చదువు అందిస్తున్నామని డైరెక్టర్ జి.ప్రవీణ్ రత్నకుమార్ తెలిపారు.



ఉపమాకలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం పంపిణీ



కె.వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అందిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషకాహార పంపిణీ జరిగింది. లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందజేశారు. తక్కువ ఖర్చుతోనే పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆకు కూరలు, పప్పు దినుసులు, గుడ్లు వాడడం ద్వారా ఎక్కువ పోషకాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, రమణమ్మ, సత్యవేణి, భాస్కరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు

కోటవురట్ల: మహిళలకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో మూడు మండలాల్లో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు చేయూత డీపీఎం వరప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. మహిళా మార్ట్‌కు అనుకూలంగా ఉందా లేదా? అన్న అంశంపై పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే మాడుగులలో మహిళా మార్ట్‌ను ప్రారంభించామని, కోటవురట్ల, సబ్బవరంలో 40 రోజుల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, వెలుగు డీపీఎం ఫైనాన్స్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని పరిశీలిస్తున్న చేయూత డీపీఎం వరప్రసాద్

వేణుగోపాల స్వామి ఆలయానికి రంగులు

కశింకోట : స్థానిక పురాతన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి యువ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంగులు వేశారు. ఈ సందర్భంగా ఆలయానికి ఉన్న రెండు ప్రధాన ద్వారాల గోపురాలను పసుపు, నీలం రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన ఆలయ గోపురానికి కూడా బంగారు వర్ణాలను అద్దారు. ఇంకా ఆలయం లోపలి భాగంలో రంగులు వేయాల్సి ఉంది. అలాగే రామాలయానికి కూడా రంగులు వేశారు. సుమారు రూ.2.50 లక్షల ఖర్చుతో రంగులు వేస్తున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు రేజేటి మారుతి తెలిపారు.



కశింకోటలోని వేణుగోపాలస్వామి ముఖ ద్వార గోపురాలకు వేసిన రంగులు

ఆకట్టుకున్న విద్యార్థిని ప్రసంగం



ధర్మిరెడ్డి ప్రశాంతి

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి విద్యాసంస్థల విద్యార్థిని తన ప్రసంగంతో ఆకట్టుకుంది. కర్ణాటక రాష్ట్రం ధర్వాడ్ యూనివర్సిటీలో జరిగిన 26వ జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా ప్రశాంతి జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న ధర్మిరెడ్డి వసంత 'భారత దేశ వారసత్వ సంస్కృతి-ఔన్నత్యం'పై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం నుంచి ప్రాతినిథ్యం వహించిన వసంతను ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, ప్రిన్సిపాల్ లాలం అప్పలనాయుడు అభినందించారు.

16న మహాలక్ష్మమ్మ తీర్థం

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని గవరపాలెం బుద్ధ రాందాసుగారి వీధిలో ఈ నెల 16న మహాలక్ష్మమ్మ దేవతతల్లి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్టు దేవత తల్లి ట్రస్టు సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారి తీర్థమహోత్సంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

విద్యుత్ తీగల వద్ద గాలిపటాలు ఎగరేయొద్దు

కశింకోట : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు ఉన్న ప్రాంతాల్లో గాలి పటాలను ఎగుర వేయొద్దని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డీఈ ఎస్.రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గాలి పటాలు ఎగరేసేటపుడు అవి సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడే అవకాశం ఉందన్నారు. వాటి ధారం ఒకవేళ తడిగా ఉంటే వైర్ల మీద పడినప్పుడు విద్యుత్ ప్రసరించి ప్రమాదాలు జరగొచ్చని హెచ్చరించారు. గాలి పటాలను ఖాళీ ప్రదేశాల్లో ఎగుర వేసుకోవాలని కోరారు. అలాగే పిల్లలు గాలి పటాలు ఎగుర వేసేటప్పుడు పెద్దలు వారి పక్కనే ఉండాలని సూచించారు. ఒకవేళ గాలిపటాలు విద్యుత్ వైర్లకు చుట్టుకుంటే విద్యుత్ ప్రసరిస్తున్న విషయం తెలియని పిల్లలు వాటిని తీయడానికి ప్రయత్నిస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

కల్కి అవతారంతో ధ్యాన వేంకటేశుడు

కశింకోట : స్థానిక శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి కల్కి అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశావతారాల్లో చివరిదైన కల్కి అవతారంలో స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామ చరణాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి.



హరిదాసు అప్పారావుకు సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న ఆడారి కుమారస్వామి

అనకాపల్లిటౌన్ : స్థానిక విజయరామరాజుపేట లక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం హరిదాసు అప్పారావుని హిందూ పండగల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎన్వీ కృష్ణ, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు కొణతాల హరనాథ బాబు, పి.సోమశేఖర్‌పట్నాయక్, బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.